# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ స్వర్ణాంధ్ర 2047 సాధనకు సమగ్ర కార్యాచరణను సిద్ధం చేశామని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలను మార్చి 21 వరకూ నిర్వహించాలని శాసనసభ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది.
- ❖ రాష్ట్రంలో 5 శాసనమండలి స్థానాల ఎన్నికలకు ఈరోజు షెడ్యూల్ విడుదల అయ్యింది.
- ❖ నిబంధనల ప్రకారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా రాదని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.
- ❖ శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

==========================

స్వర్ణాంధ్ర 2047 కలను సాకారం చేస్తామని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. 2025-26 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ... సమాజ అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం గత 8 నెలల్లోనే గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాల ద్వారా సుస్థిర వృద్ధికి బాటలు వేస్తోందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేరుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర కార్యాచరణను సిద్ధం చేశామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ నిర్వహించామని, తల్లులకు చేయూతనిస్తూ... 'తల్లికి వందనం' పథకాన్ని త్వరలో అమలు చేస్తామని గవర్నర్ ప్రసంగిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

==========================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలను మార్చి 21 వరకూ నిర్వహించాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన జరిగిన శాసనసభ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది. ఈ నెల 28న 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు. మార్చి 19న బడ్జెట్ కు శాసనసభ ఆమోదం తెలపనుందని, బడ్జెట్ ఆమోదం పొందాక సభ వాయిదా పడటం ఆనవాయితీ అని.. కానీ ఇతర అంశాలు ఏమైనా ఉంటే చర్చించేందుకు వీలుగా మరో 2 రోజులు అదనంగా కేటాయించామని ప్రకటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

========================

రాష్ట్రంలో 5 శాసనమండలి స్థానాల ఎన్నికలకు ఈరోజు షెడ్యూల్ విడుదల అయ్యింది. మార్చి 29తో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనున్న నేపథ్యం లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు మార్చి 3న నోటిఫికేషన్, 20న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఒక ప్రకటన విడుదల అయ్యింది.

========================

గవర్నర్ ప్రసంగం సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేది కాదని, ప్రజలు ఇస్తేనే వస్తుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అత్యధిక మెజార్టీలో రెండో స్థానంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా లభిస్తుందన్నారు. ఈ విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు హుందాగా ప్రవర్తించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈరోజు ఆయన మీడియా పాయింట్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను చర్చకు తీసుకురావాలని పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

========================

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా చిత్తూరు జిల్లా సచివాలయంలో ఈరోజు ప్రజల నుండి అర్జీలను స్వీకరించామని కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారని.. ఆన్ లైన్ లోను వినతిపత్రాలను అప్ లోడ్ చేసి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

విరామం

========================

తిరుపతి జిల్లాలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు స్వామి వారు వ్యాఘ్ర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవలను తిలకించిన భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించారు. అలాగే తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరుని మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో హంస, యాళీ వాహన సేవలు నాలుగవరోజైన ఈరోజు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు దివ్య అలంకారాలు చేసి మేళతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి వారిని హంస వాహనంపై, అమ్మవారిని యాళీ వాహనంపై కొలువు తీర్చి విశేష హారతులు సమర్పించారు.

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు సౌకర్యార్థం పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ శైవ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా రవాణా శాఖ రీజనల్ మేనేజర్ వరప్రసాదరావు చెప్పారు. ఈ రోజు భీమవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాడేపల్లిగూడెం డిపో

నుండి వీరంపాలెంలోని స్పటిక శివలింగ దర్శనానికి రేపు మధ్యాహ్నం నుండి 27వ తేదీ ఉదయం వరకు ప్రతీ 30 నిమిషాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఏలూరు జిల్లాలో విశేషమైన పట్టిసీమకు తాడేపల్లిగూడెం నుండి వయా నిడదవోలు, కొయ్యలగూడెం మీదుగా 25వ తేదీ మధ్యాహ్నం నుండి 27వ తేదీ ఉదయం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

========================

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులది కీలకపాత్ర అని పార్వతీపురం మన్యం జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... సాధారణ పరిశీలకుల పర్యవేక్షణలో సూక్ష్మ పరిశీలకులు జవాబుదారీతనంతో పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పరిశీలకులు ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

========================

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లలెక్కింపు ప్రక్రియ సజావుగా జరగాలని పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. ఈ రోజు ఏలూరులో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం అనంతరం ఆమె మాట్లాడుతూ... ఎన్నికల ఓట్లలెక్కింపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి వుండి, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని మొత్తం 3 లక్షల 14 వేల 984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ వెల్లడించారు.

========================

రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా దీపం-2 పథకాన్ని ప్రవేశపెట్టిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టీ నిషాంతి పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 31 ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, డెలివరీ సిబ్బందితో స్థానిక గోదావరి భవన్ లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మార్చి ఒకటో తేదీ నుండి గ్యాస్ డోర్ డెలివరీలో అదనపు చార్జీలు వసూళ్లు ఆపేయాలని ఆదేశించారు. రశీదులో ముద్రించిన సొమ్మును మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు.  అదనపు సొమ్ము వసూలు చేస్తే టోల్ ఫ్రీ 1967కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

========================

పశ్చిమ  బెంగాల్ నుండి ఒడిస్సా మీదుగా దక్షిణ ఛత్తీస్ గఢ్ వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రా, రాయలసీమలో ఆగ్నేయ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం వుందని వాతావరణ అధికారి వెల్లడిస్తూ....

(వాయిస్ 22 సెకన్లు)

========================
========================